వంటింటి లెక్చర్లు (౧)
గోవూవత్సం

ఆడది లేస్తే మగాడు కూచోవాల్సిందే - గరిట తిరగేసి ఆడది విసి రేసిందంటె మగాడి ఛాప్టర్ క్లోజ్. మనదేశంలో మగవాళ్ళ ఛాప్టర్ ఈ విధంగా క్లోజయినప్పుడల్లా ఆడాళ్ళు 'విడోస్' "డెస్టిట్యూట్సు"– అవటం ఆచారంగా వస్తూంది. రెండవతరగతి పౌరులుగా వుంటూ ఆడాళ్ళు దేశాని కేమీ చెయ్యలేరు. వాళ్ళ ప్రతిపత్తిని పెంచుకుంటూ మగాళ్ళ సోషల్ డామి నేషన్‌ని కుదింప చేయగలిగి వుండాలి. పురుష సమాజం ఆధిక్యతను బల పర్చే అన్ని సూత్రాలను ఆచారాలనూ ఆడాళ్లు గంగలో తొక్కెయ్యాలి. అప్పుడు కాని "లేచింది మహిళాలోకం, నిద్రలేచింది మహిళాలోకం" అనే రికార్డుకు అర్థంలేదు.

మొన్నీమధ్యనో సినిమా చూశా - ఆడ కలెక్టరయినా మొగుడు గుమాస్తా అయినా ఆఫీసులోకి రాగానే లేచి నిల్చుంటుంది. సాంఘిక ప్రతి పత్తి పెరిగినా ఆడది అణగి మణగి పడుండాలి. ప్రాతివ్రత్యధర్మాన్ని మోసి ఆదర్శంగా తన జీవితాన్ని దమ్మిడీకి కొరగాని పురుషునికై తగల పెట్టాలి. ఆడదానికొచ్చే బాధలన్నీ వ్యక్తిగతమైనవికావు. సమాజం ఆమె

నెత్తిమీద రుద్దినవి. నిజానికి "స్త్రీ" తన సమస్యలను పరిష్కరించుకో గలదు. కాని అలా ఆమె స్వతంత్రంగా తన వ్యక్తిగత సమస్యలకు పరిష్కారాన్ని వెతుక్కోవటం సమాజానికి గిట్టదు. అది శాసించిన మేరకు ఆమె నడుచుకోవాలి. ఇది ఎంత అమానుషం, అన్యాయం ? డబల్ స్టాండర్డ్స్ కొనసాగించటం అనివార్యమా?

చివరకి కలెక్టరుచేత నేత్రదానం కూడా చేయించారు. ఆమెను సిని మాలో నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఈ దేశంలో ఆధునిక యువతి తన జీవితంలో తనతో ప్రమేయం లేకుండా ఎదుర్కొనే సమస్యలకు పరిష్కా రములేదా? ఆమె చనిపోవటమే వాంఛనీయమా? దారుణం! దారుణం! ఇక ఈ దేశం ఒక అడుగు కూడా ఎట్లా ముందుకు పోతుంది ? ఆడదానికి అసెంబ్లీలో సీట్లిచ్చి వంటింట్లో వాతలు పెడుతున్నదీ సమాజం. ఛీ ! ఛీ!

పడకగదుల్లోంచి, నూతిపళ్ళాల వద్దనుంచి, వంటింటి సంకెళ్ళను త్రెంచుకొని మహిళాలోకం లేచింది—నిజమే—మళ్ళీ పొగల్లో మంటల్లోకి పడిపోకూడదు. అస్తమానూ అన్ని త్యాగాలనూ చేయమని ఆడదాన్ని అడగటానికి ఈ హిందూ సమాజానికి సిగ్గు వెయ్యదా ?

నిద్రలేచిన ఆడాళ్ళు మగాళ్ళకు ముసుగేసి కూర్చోపెట్టేస్తున్నారు. కాని అసెంబ్లీకి వెళ్ళేముందు భర్తలకు పాదపూజలు చేసేవారూ, కారులో అద్దాలకు పరదాలు కట్టుకునే స్త్రీలు మనకెందుకు ? మనకు పిల్లల్ని కనే యంత్రాలు, మనకు బానిస చాకిరీ చేసే జీవులు అధిక సంఖ్యలో కావాలి. కాని వారిప్పుడు చదువుకొంటున్నారు. ఎక్కువ సంఖ్యలో తమ కష్టాలు, గాథలు గురించి ఆలోచిస్తున్నారు, చర్చించుకుంటున్నారు. కాని వాళ్ళకు భయంపోలేదు. సోషల్ సెక్యూరిటీ (సాంఘిక భద్రత) సంప్రదాయంలో వుంది గనుక దానిని అంటిబెట్టుకుని జీవించటం కోసం సమాధాన పడు తున్నారు. ఈ కలవరాన్ని గమనించిన నేటి సమాజం వీరిని బుజ్జగించి

బుట్టలో పెట్టడానికి సమానావకాశాలపేరిట ఉద్యోగాలు, ఊళ్ళేలడాలు అంటగడుతున్నారే కాని సంప్రదాయం గీచిన గీటు కాస్త యిటూ ఆటూ బెసిగినా మళ్ళీ అసెంబ్లీ మెంబరురాలైనా అని జాలి తలవక కాళ్ళమీద కొడతారు చింతబరికెలతో.

“స్త్రీ” అమ్మ శక్తి - అబలకాదు. మగవాడు చేసే అన్ని పనులూ మగాడికంటె బాగా చేస్తుంది. రైట్ - కాని ఆవిడ తన పవిత్ర విద్యుక్త ధర్మాలేవీ విస్మరించటానికి వీలులేదు. ఆఫీసులో ఉద్యోగం చేయాలి. ఇంట్లో అంట్లూ తోమాలి, డబ్బు సంపాదించాలి. కాని ఇంట్లో యిచ్చి మొగుడి దగ్గర్నుంచి అర్ధణా, అణా బస్సు డబ్బులు అడిగి పుచ్చుకోవాలి. అసెంబ్లీకి వెళ్ళినా పరవాలేదు-ఇంటికొచ్చాక పడగ్గదిలో శయనేషు రంభా,



షట్కర్మ యుక్తాకుల ధర్మపత్ని అవాలి. షట్కర్మలకూ లోటు రాకుండా స్త్రీ మసలాలి. ఇదెలా సంభవమో బోధపడకుండా వుంది. ఆడపనీ మగ పనీ చేస్తానంటే చేయి కాని నీ స్థానం వంటింట్లోనే-నీకు తిండిపెట్టి బట్ట

యిచ్చి వుండటానికి ఆశ్రయమిచ్చి పోషిస్తున్నందుకు నువ్వు అణగి మణగి పడుండాల్సిందే. ఈ మేకు బిగుంపు చాలా నాజూకుగా బిగిస్తున్నారు కాని అసలు దృక్పథంలో మార్పేమీలేదు.

స్త్రీలు మ్యునిసిపల్ కవున్సిలర్స్, జిల్లాబోర్డు, చెయిర్మను, మెంబర్లూ పార్లమెంటు అసెంబ్లీ, సభ్యులు అయినంత మాత్రాన వాళ్ళ స్థితిగతుల్లో లేదా దేశంలోని స్త్రీల పరిస్థితుల్లో వచ్చిన వస్తున్న పరిణామాలేమిటి? ఏమీలేవు, తెలుగు సినిమాలు చూడండి. పవిత్ర భారత నారీత్వాన్ని పాతివ్రత్యాన్ని బోధిస్తాయి. త్యాగాలూ కన్నీళ్ళూ కష్టాలు రాసిపెట్టి వున్నాయి తల్లీ నీ మొహాన అంటాయి.

సామాన్య స్త్రీకి పదవులవల్ల ఒరిగేదేమిటి — కట్న కానుకలు లేకుండా వివాహాలు అవుతున్నాయా? ఆర్థిక స్వాతంత్ర్యం వుందా? ఆఖరికి తన కన్నబిడ్డలపై కూడా ఆడదానికి ఏమీ అధికారం లేదు. కాని ఆవు దూడపై అధికారం మొగవానిదే. ఆవు దూడా మీదా ఉత్సాహంతో గుద్దేశారు కాని ఆవు దూడతోసహా ఆడదానిమీద పెత్తనం ఎవరిచేతుల్లో వుందో వారే నిజమైన యజమానులు.

అంచేత "లేచింది మహిళాలోకం, నిద్రలేచింది మహిళా లోకం" అని పాత రికార్డు పదే పదే పాడి వినిపించి లాభంలేదు. పడగ్గదిలో అక్కడి దిక్కడ సర్దినట్లు సర్దుబాటులు చేస్తారు. గట్టిగా స్పీకరు "కూచోవమ్మా" అంటే పవిటచెంగుతో కళ్ళు తుడుచుగుంటారు. స్త్రీసుగుణాల ఖని, సౌందర్యరాశి, సుకుమారపు బుట్ట అన్నంతకాలం ఆ "ఇమేజి" దేశానికేమీ ఒరగపెట్టేదిలేదు. స్త్రీ అంతర్మథనం తెలుసుకొని ఆమె అంతః స్వరూపాన్ని గుర్తించి ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించటానికి సిద్ధంగా లేని సమాజం ఆమెను ఏ కుర్చీలో కూర్చోబెట్టి గౌరవిస్తేనేం ? హెన్రీమురే

అనే శిల్పి ఒక స్త్రీ ముఖాన్ని చేసి ప్రదర్శనలో పెట్టాడు. ఆ మూర్తి చాలా వికారంగా ముఖంనిండా గుంటలతో చూడగానే చాలా బాధ కలిగిస్తుంది. "అందంగా వుండాలి కదా స్త్రీ ముఖం" అన్నారుట కొందరు. స్త్రీ బాహ్య రూపం ఎంత అందంగా ఆకర్షణీయంగా వున్నప్పటికీ "కళాత్మకం" కానేరదు, ఆమె లోపలి మూర్తిని చెక్కాను అన్నాడట - లోపలి మనిషికి న్యాయం చేయకుండా బయట పీటవేసి కూర్చోపెట్టి వాయినాలు యిచ్చి ముత్తయిదువును మర్యాద చేసినట్లు మర్యాద చేసినంత మాత్రాన ఎవరూ పొంగిపోనక్కర్లేదు. ఆవు దూడా ఈ రెండూ ఎవరికి చెందుతాయో కాస్త ఆలోచించండి తల్లులారా!